సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 19 । జనవరి । 2024



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



శ్రీరామపాదుకలకు పూజలు

వేములవాడఅర్బన్: రాజన్న సన్నిధిలో గురువారం అయోధ్య బాలరాముడి ఆలయంలో అభిషేకం చేయించి తీసుకొచ్చిన శ్రీరామ పాదుకలకు పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.0

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందించాలి



కోనరావుపేట(వేములవాడ): ప్రజా ఫిర్యాదుల్లో జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఠాణా పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, రెస్ట్‌రూమ్, లాకప్‌రూమ్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, బీట్‌డ్యూటీ బుక్, సస్పెక్ట్ చెక్ రిజిష్టర్లను తనిఖీ చేసి మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాల్లో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది పెట్రోలింగ్ చేయాలని సూచించారు. వీపీవోలు తమకు కేటాయించిన గ్రామాలు పర్యటిస్తూ పూర్తి సమాచారం సేకరించాలని తెలిపారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు



వేములవాడఅర్బన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. వేములవాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ సురేంద్రబాబు తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహితంగా మార్చుకుందాం



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చుకుందామని మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ కోరారు. పట్టణంలోని వ్యాపారులతో గురువారం మున్సిపల్ ఆఫీస్‌లో సమావేశమై మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని కోరారు. ఫిబ్రవరి 18 వరకు గడువు విధిస్తున్నామని, ఆ తర్వాత పట్టణంలో ప్లాస్టిక్ అమ్మిన, వినియోగించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని సిరిసిల్ల సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య పేర్కొన్నారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతిలో టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు గురువారం జనపాల సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నగదు, మెమొంటోలు అందించారు. సర్పంచ్ బద్ది కల్యాణి, ఎంపీటీసీ లలిత, హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, భాను, క్రాంతి, వెంగళ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వరిపంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్‌లో రైతులు సాగుచేసిన వరిపంటను గురువారం జిల్లా ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) అధికారి, కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ మధూకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు విజయభాస్కర్, ఉషారాణి, మధూకర్‌రావు వరి పంటను ఆశించే మొగిపురుగు లక్షణాలు వివరించారు. ఏఈవో శ్రీదేవి ఉన్నారు.

పనులేమీ చేయొద్దు !



ఇది సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు క్యాంపు ఆఫీస్ ముందున్న కచ్చా డ్రెయినేజీ. కొండాలక్ష్మణ్ బాపూజీ సర్కిల్ నుంచి వచ్చే ఈ మురికికాల్వను శాశ్వతంగా సిమెంట్‌తో నిర్మించేందుకు టీయూఎఫ్ఐడీసీలో భాగంగా రూ.40కోట్లు మంజూరు చేశారు. జీవో ఇచ్చినప్పటికీ వర్క్ ఆర్డర్ ఇవ్వలేదు. దీంతో ఈ డ్రెయినేజీని నిర్మించొద్దని ఈఎన్‌సీ నుంచి సిరిసిల్ల మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ పనులు ఆగిపోయాయి.



ఇది సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ నుంచి మొదటి బైపాస్‌కు వెళ్లే మట్టి రోడ్డు. ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చేందుకు రూ.40 కోట్లు మంజూరు చేస్తూ గత సెప్టెంబర్ 18న ఆర్డర్ ఇచ్చారు. టీయూఎఫ్ఐడీసీలో భాగంగా సిరిసిల్ల పట్టణాభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరుచేశారు. కానీ ఈ మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చొద్దని, ఎలాంటి కొత్త పనులు చేయొద్దని మున్సిపల్ ఉన్నతాధికారులకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు.



ఇది జిల్లా కేంద్రంలోని కొత్తచెరువు కట్ట కింద ఉన్న వరదనీటి మళ్లింపు కచ్చా కాల్వ. వర్షాకాలంలో కొత్తచెరువు మత్తడి నీరు ఎక్కువగా రావడంతో ఈ కచ్చాకాల్వను తవ్వారు. వరద నివారణలో భాగంగా ఈ కాల్వను శాశ్వతంగా సిమెంట్‌తో నిర్మించేందుకు రూ.15 కోట్లు మంజూరుచేస్తూ గతేడాది అక్టోబర్ 8న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని ఈ నిధులు మంజూరు చేయగా.. ఎన్నికల కోడ్‌తో ప్రారంభించలేదు. ఈ పని కూడా చేయొద్దని ఈఎన్‌సీ నుంచి ఆదేశాలు అందడంతో శ్రీనగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ఆగిపోయాయి.

- మున్సిపల్ అధికారులకు ఆదేశాలు
- సిరిసిల్లలో ఆగిన రూ.55 కోట్ల అభివృద్ధి పనులు
- సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, ముంపు నివారణ పనులకు బ్రేక్
- వర్క్ ఆర్డర్ లేని పనులు నిలిపివేత

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని విలీన గ్రామాలైన చంద్రంపేట, రగుడు, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, సర్దాపూర్, పెద్దూరు గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు రూ.40కోట్లతో ఊరికి రూ.3కోట్ల చొప్పున పనులను ప్రతిపాదించారు. అన్ని గ్రామాల్లోనూ మెజార్టీ పనులు పూర్తవుతాయని భావించారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో జారీ చేసిన జీవోలకు సంబంధించిన పనులను వర్క్ ఆర్డర్ వచ్చేంత వరకు చేయొద్దని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రతిపాదించిన పనులు ముందుకుసాగడం లేదు. ఫలితంగా సిరిసిల్లలోని విలీనపల్లెల్లో అభివృద్ధి పనుల జాడలేదు.

అన్ని వార్డుల్లోనూ పనులు

సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రెండు జీవోల ద్వారా మంజూరైన రూ.55 కోట్లతో 39 వార్డుల్లో వివిధ పనులను మున్సిపల్ అధికారులు ప్రతిపాదించారు. సిమెంట్‌రోడ్లు, మురికికాల్వలు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వంటి పనులను ప్రతిపాదించగా.. ఒక్క పని కూడా చేపట్టకుండానే ఆ రెండు జీవోలు సందిగ్ధంలో పడ్డాయి. ఇప్పటికే ప్రగతిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి పనులు, ఉదారువాగు అభివృద్ధి పనులు, పలు వార్డుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. గతంలో చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ప్రగతిలో ఉన్న పనులు ముందుకు సాగడం లేదు. పనులు చేయొద్దనే ఆదేశాలలో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది.

ఆ పనులకు అనుమతించాలి



సిరిసిల్ల పట్టణ అభివృద్ధిలో భాగంగా మంజూరైన రూ.55కోట్ల పనులకు అనుమతించాలి. పట్టణంలోని 39 వార్డుల్లో పలు పనులను కౌన్సిల్ ఆమోదంతో పంపించాం. ఈమేరకు ప్రభుత్వం రెండు జీవోలను జారీచేసింది. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ పనులకు అనుమతిస్తే.. పట్టణవాసులకు సౌకర్యాలు దరి చేరుతాయి.

– జిందం కళాచక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, సిరిసిల్ల

భోజనం ఎలా ఉంటుంది ?



వేములవాడ మైనార్టీ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- హాస్టల్, గురుకుల విద్యార్థులతో కలెక్టర్ అనురాగ్ జయంతి
- పరిశుభ్రత, విద్యార్థుల భద్రతపై శ్రద్ధ చూపాలి
- ఒక్క విద్యార్థి కూడా అనారోగ్యం బారినపడొద్దు
- హాస్టళ్లు, గురుకులాల తనిఖీ
- విధుల్లో లేని హాస్టల్‌వార్డెన్ సస్పెన్షన్

సిరిసిల్ల: 'వేడి నీళ్లు ఉన్నాయా.. గీజర్ పని చేస్తుందా.. భోజనం ఎలా ఉంటుంది.. మినరల్ వాటర్ అందుబాటులో ఉందా? దుప్పట్లు, యూనిఫామ్స్ పంపిణీ చేశారా..?' అంటూ కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లోని బాలికల హాస్టల్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ, అగ్రహారం, తిప్పాపూర్‌లోని హాస్టళ్లను, గురుకులాలను గురువారం అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో పరిశుభ్రత బాగుండాలని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఒక్క విద్యార్థి కూడా అనారోగ్యం బారిన పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల సంఖ్యను వందశాతం పెంచాలని ఆదేశించారు. హాస్టళ్లకు కొత్తగా పేయింటింగ్ వేయించాలని, ఓఆర్ ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ప్రత్యేకాధికారి రఫీని ఆదేశించారు. మైనార్టీ గురుకులంలో ఒకే బోరుపై మూడు స్కూళ్ల పిల్లలు ఆధారపడినట్లు గుర్తించిన కలెక్టర్ మరో బోరు మంజూరు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేరు చేయించాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి గంగయ్యను ఆదేశించారు. దోమల బెడద లేకుండా మెష్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు బెడ్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని వార్డెన్ రాజేశంకు సూచించారు.

వసతి గృహ అధికారిణిపై సస్పెన్షన్ వేటు

సిరిసిల్ల ప్రభుత్వ బాలికల బీసీ వసతి హాస్టల్ తనిఖీ చేస్తున్న సమయంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కళ్యాణి విధుల్లో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఆమెను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె స్థానంలో మరో మహిళా అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకాధికారులు సర్వర్ మియా, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కొమురయ్య, రఫీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



రుద్రంగిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: అప్పుడు నేతన్నలను ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వస్త్ర పరిశ్రమపై లేఖ రాయడాన్ని తప్పుపడుతున్నామన్నారు. 2004 సిరిసిల్లలో టెక్స్‌టైల్‌పార్క్ తీసుకొచ్చి పరిశ్రమలు నెలకొల్పేలా అభివృద్ధి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో టీడీపీ నిర్లక్ష్యంతో అనేక మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో సిరిసిల్లకు ప్రత్యేక ప్యాకేజీ అందించారన్నారు. మరో నాలుగు నెలల్లో పదవి కోల్పోతున్న ఎంపీ బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా వస్త్రపరిశ్రమకు తీసుకురాలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 20 వేల మంది కార్మికులు ఉన్న ఈ ప్రాంతం నుండి వినోద్‌కుమార్, బండి సంజయ్ కలిసి కాకతీయ టెక్స్‌టైల్‌ను వరంగల్‌కు తరలించింది.. నిజం కాదా అని ప్రశ్నించారు. వస్త్రపరిశ్రమపై జీఎస్టీని తొలగించాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, వంగల శ్రీనివాస్, చిలివేరి శ్రీనివాస్, శ్రీధర్, జమున ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

రుద్రంగి(వేములవాడ): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగిలో గురువారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరై మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై నియోజకవర్గ కేంద్రానికి వచ్చే ఇబ్బందులను తగ్గించేందుకు మండల కేంద్రంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రెండు నెలలకోసారి ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రుద్రంగి తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో మాలోతు శంకర్, ఎంపీవో సుధాకర్, పీఆర్ ఏఈ మనోహర్, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, పంచాయతీ కార్యదర్శి రాందాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తూము జలపతి, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం పాల్గొన్నారు.

ఎంపీ అయ్యాక ఏనాడూ ఖాళీగా లేను

- రూ.10వేల కోట్ల అభివృద్ధి జరిగింది
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

సిరిసిల్ల: ఎంపీగా అయ్యాక ఏనాడూ ఖాళీగా లేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని లహరి ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో బీజేపీ కార్యకర్తలు తలెత్తుకొని కాషాయ జెండా పట్టుకుని తిరిగేలా పోరాటాలు చేశానన్నారు. కరీంనగర్ జిల్లాకు బండి సంజయ్, మోదీ చేసిందేమిటని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిచాక రూ.10వేల కోట్ల నిధులు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తెచ్చానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చిందనే పూర్తి వివరాలను ఊరూరా ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. కార్యకర్తల జోష్ చూశాక ఎంపీ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈనెల 28న కరీంనగర్‌లో జరిగే సమ్మేళనానికి ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలోని 20 మంది కార్యకర్తల చొప్పున పార్లమెంట్ పరిధిలో దాదాపు 40 వేల మంది కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధికారంలో ఉన్న రోజుల్లో అప్పటి మంత్రి కేటీఆర్ బీజేపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టినా భరించారు.. జైలుకు వెళ్లారు. 'మీ పోరాటానికి హ్యాట్సాఫ్' అని సంజయ్‌కుమార్ అన్నారు. రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాష్ట్ర నాయకులు మీసాల చంద్రయ్య, కృష్ణారెడ్డి, చెన్నమనేని వికాస్‌రావు, ఆరెపల్లి మోహన్, బాస సత్యనారాయణ, బోయినపల్లి ప్రవీణ్‌రావు, ఆడెపు రవీందర్, రెడ్డబోయిన గోపి, నాగుల శ్రీనివాస్, బర్కం నవీన్, చీటి కమలాకర్‌రావు, సుభాష్‌రావు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి బాధ్యతలు

సమావేశానికి 700 మంది కార్యకర్తలు హాజరు కాగా.. ప్రతీ ఒక్కరికి పార్టీ బాధ్యతలు అప్పగించారు. గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ విజయానికి పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తామని ప్రజలు సిద్ధమయ్యారని, సమావేశానికి వచ్చిన వారితో సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బాధ్యతలు అప్పగించడం విశేషం.

పాత బస్సుల్లో ప్రయాణమెలా?

- 15 లక్షల కి.మీ. పైబడి తిరిగినవే అందుబాటులో..
- కరీంనగర్ రీజియన్‌లో 861 బస్సులు
- 186 మందే మెకానిక్‌లు
- గత నెలలో ఎల్కతుర్తిలో ఊడిన పల్లె వెలుగు బస్సు టైర్లు
- 'ఆర్టీసీ' ప్రయాణంపై ప్రజల్లో ఆందోళన

'గత డిసెంబర్ చివరి వారంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఎల్కతుర్తి సమీపంలో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు టైర్లు ఊడిపోయాయి. ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రయాణికులను గమ్యం చేర్చే విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఆర్టీసీ, అద్దె బస్సులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెకానిక్‌లతో రోజువారీగా తనిఖీలు నిర్వహించి, బస్సుల కండీషన్‌పై నిఘా పెంచాలన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో అవే పాత బస్సులు, అరకొర సిబ్బంది(మెకానిక్‌లు)తో నెట్టుకొస్తున్నారు. నిత్యం ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సామాన్య ప్రజానీకం బస్సుల కండీషన్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.'



కరీంనగర్: ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉన్నాయి. కరీంనగర్–1, 2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల్లో 524 ఆర్టీసీ, 337 అద్దె బస్సులు మొత్తంగా 861 నడుస్తున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులే 230. ఇన్ని వాహనాలకు కేవలం 186 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. ఈ బస్సులు రీజియన్ పరిధిలో ప్రతీరోజు 3.50 లక్షల కిలోమీటర్లు తిరిగి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయాన్ని ఆర్టీసీకి సమకూర్చుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగేళ్లుగా కొత్త బస్సులను డిపోలకు కేటాయించలేదు. ఉన్నవి 15 లక్షల కిలోమీటర్లు పైబడి తిరిగినవే కావడంతో వాటిని నడిపేందుకు డ్రైవర్లు నిత్యం సాహసమే చేస్తున్నారని చెప్పవచ్చు. బస్సులు కండీషన్‌లో లేకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడపాల్సి వస్తోందని వాపోతున్నారు. లోకల్ బస్సులతో పాటు దూరప్రాంతాలకు వెళ్లే అన్ని రకాల సర్వీసులు ప్రయాణానికి అనుకూలంగా లేవని, నష్టాల ఊబిలో చిక్కుకున్న ఆర్టీసీని కాపాడుకోవాలని టార్గెట్లు పెట్టడమే తప్ప తమ బాగోగులు చూడటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు వాపోతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని, కాలం చెల్లిన బస్సులను సైతం నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

నాలుగు బృందాలుగా మెకానిక్‌లు..

బస్సుల మరమ్మతుల కోసం మెకానిక్‌లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. మొదటి బృందంలో ఎక్కువ మంది మెకానిక్‌లు ఉండి, ప్రతీ బస్సును నిత్యం పరిశీలిస్తారు. రెండో బృందం బస్సు ట్రిప్పునకు వెళ్లి వచ్చిన ప్రతీసారి తనిఖీ చేస్తుంది. మూడో బృందం ప్రతీ బస్సును వారానికోసారి ప్రత్యేకంగా పరిశీలించి, గ్రీజింగ్ చేసి, ఫిల్టర్లు శుభ్రం చేస్తుంది. ఇక నాలుగో బృందం నెలకోసారి బస్సుల టైర్లు, గేర్‌బాక్స్‌లను పరిశీలిస్తుంది. ఇంజిన్ ఆయిల్, ఫిల్టర్లను మార్చుతుంది. దీంతోపాటు డ్రైవర్లు సూచించిన సమస్యలను పరిష్కరిస్తుంది.

నూతన నియామకాల్లేవ్..

సాధారణంగా డిపోలో 100 బస్సులుంటే 32 మంది మెకానిక్‌లు, ఒక్కో మెకానిక్‌కు ఒక సహాయకుడు ఉండాలి. కొన్నేళ్లుగా ఆర్టీసీలో నూతన నియామకాలు చేపట్టకపోవడంతో మెకానిక్‌ల సంఖ్య తగ్గింది. అయితే, బస్సుల సంఖ్య సైతం తగ్గినందున సరిపడా మెకానిక్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని డిపోల్లో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించారు. మెకానిక్‌లకు సరిపడా సహాయకులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అప్రెంటిస్‌లను నియమిస్తున్నా సరిపడా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పని చేసేందుకు విముఖత చూపుతున్నారన్న చర్చ జరుగుతోంది.

ఏ డిపోలో ఎంతమంది?

గోదావరిఖనిలో 28 మంది, హుస్నాబాద్‌లో 9, హుజూరాబాద్ 17, కరీంనగర్–1 డిపోలో 26, కరీంనగర్–2 డిపోలో 22, మంథనిలో 13, జగిత్యాలలో 22, కోరుట్లలో 15, మెట్‌పల్లిలో 10, సిరిసిల్లలో 12, వేములవాడలో 12 మంది మొత్తంగా 186 మంది మెకానిక్‌లు విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే కొత్త బస్సుల కేటాయింపులతోపాటు సిబ్బందిని నియమించాలని యజమాన్యాన్ని కోరుతున్నారు.

నిత్యం పరిశీలించాలి..

సాధారణంగా బస్సును డిపో నుంచి బయటకు తీసే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి, సమస్యలు ఉంటే మెకానిక్‌లచే మరమ్మతులు చేయించాలి. టైర్లు, ఇతరత్రా ముఖ్యమైన విభాగాలను పరిశీలించి, ఊడిపోయేలా ఉన్నట్లు, బోల్టులను బిగించి, పంపించాలి. ఇదే సమయంలో ఆరోజు విధుల్లో ఉండే డ్రైవర్ తనకు కేటాయించిన బస్సును సరిచూసుకొని, ఏమైనా సమస్యలను సూచిస్తే పరిష్కరించాలి. అనంతరం బస్సు ప్రయాణం పూర్తయిన తర్వాత డిపోలోకి వచ్చే సమయంలో డ్రైవర్లు గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా సూచిస్తారు. వీటిని రాత్రి విధుల్లో ఉండే మెకానిక్‌లు పరిష్కరిస్తారు.